# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

మెదక్ | సంపుటి: 19 సంచిక : 161 | శుక్రవారం 13, ఫిబ్రవరి 2026 | పేజీలు: 06 వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamabad-Adilabad -Vijayawada-Guntur-Vizag-Kurnool | www.prajaswaramdaily.com


MHR TV

## వారిద్దరి పాలనలో ఉద్యమకారులు, అమరవీరులకు అన్యాయం



**సోయి లేని రేవంత్ సీఎం కావడం దురదృష్టం**
**ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే వదలిపెట్టం**
**ఉద్యమకారుల బిడ్డలకు**
**ప్రైవేట్ ఉద్యోగాల్లో 20 శాతం రిజర్వేషన్లు కల్పించాలి**
**త్వరలోనే కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు**
**ఉద్యమకారుల ఆత్మగౌరవ సభలో జాగృతి అధ్యక్షురాలు కవిత**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
తెలంగాణ ఏర్పాటు తర్వాత ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాలకు తీరని అన్యాయం జరిగిందని జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమ సోయి లేని రేవంత్ రెడ్డి సీఎం కావటం మన దౌర్భాగ్యం ..మిగతా 2లో

## 18 లక్షల మెట్రిక్ టన్నుల అదనపు ధాన్యం తీసుకోండి



**యాసంగి ధాన్యం సేకరణ గడువు రెండు నెలలు పొడిగించండి**
**బాయిల్డ్ రైస్‌లో అయిదు శాతం నూకకు అనుమతించండి**
**2014-15 బకాయిలు రూ.1,468.94 కోట్లు విడుదల చేయండి**
**కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వినతి**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
వానాకాలం పంటకు (202526 సీజన్) సంబంధించి తాము అదనంగా సేకరించిన 18 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఎఫ్‌సీఐ తీసుకోవాలని కేంద్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రిని ఆయన నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గురువారం కలిశారు. వానా కాలం పంటకు ..మిగతా 2లో



## లింక్స్‌తో లంకె

**వాలెంటైన్స్ పేరుతో ఫిషింగ్ లింక్స్ వల**
**ఫేక్ ప్రొఫైల్స్‌తో గిఫ్ట్ స్కామ్‌లు**
**పార్సిల్, ఆఫర్ల పేరుతో డబ్బుల దోపిడి**
**వీడియో కాల్ బ్లాక్‌మెయిల్‌లపై పోలీసుల హెచ్చరిక**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
వాలెంటైన్స్ డేకు సైబర్ క్రిమినల్స్ కూడా రెడీ అయిపోయారు..!! అదేంటీ.. వాలెంటైన్స్ డేకు సైబర్ క్రిమినల్స్ రెడీ అయ్యారని ఆలోచిస్తున్నారా? అంటే.. వారు కూడా లవ్ చేస్తారని కాదు..!! వాలెంటైన్ డే కోసం ఆత్రుతగా ఎదురు చూస్తున్న వారిని సైబర్ లింకులతో బురిడీ కొట్టిస్తారు.. ఖాతాలు ఖాళీ చేస్తారు. ఈ క్రమంలో ఫిషింగ్ లింక్స్‌పై జాగ్రత్తగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. నిజమైన ప్రేమికుల సంగతి అటు పక్కకు పెడితే.. వాలెంటైన్స్ డే కోసం సైబర్ క్రిమినల్స్ సైతం రంగంలోకి దిగారు. ప్రేమికుల సందడి పెరుగుతున్న వేళ.. సైబర్ నేరగాళ్ల చలనం కూడా అదే ..మిగతా 2లో

# తెలంగాణకు నేనే రాజు.. నేనే మంత్రి



**రాష్ట్రంలో నాకు పోటీ ఎవరూ లేరు**
**మరో పదేళ్లు నేనే సీఎంగా ఉంటా**
**కాళేశ్వరం, ఫార్ములా ఈ-రేసుపై**
**కేంద్ర ప్రభుత్వం చర్యలవీ..?**
**సోనియా, రాహుల్ ను విచారించిన ఈడీ,**
**కేటీఆర్‌ను ఎందుకు విచారిస్త లేదు**
**తుది అంకానికి ఫోన్ ట్యాపింగ్ కేసు**
**కేసీఆర్‌పై మాకు కక్ష సాధింపు లేదు**
**కేసీఆర్‌ను జైల్లో వేయాల్సి వస్తే**
**నిబంధనల ప్రకారమే వేస్తాం**
**మా ప్రభుత్వంలో**
**ఎవరి ఫోన్లు ట్యాప్ చేయడం లేదు**
**కాళేశ్వరం ప్రాజెక్టు కూలితే నా నింద మాపై**
**మోపాలని బీఆర్ఎస్ చూస్తోంది**
**బీఆర్ఎస్ నేతలు**
**కోరినట్లుగా మా ప్రభుత్వం నడవదు**
**2029లో దేశంలో**
**జమిలీ ఎన్నికలు రాబోతున్నాయి**
**ఢిల్లీలో మీడియాతో సీఎం రేవంత్ చిట్ చాట్**

**న్యూఢిల్లీ (ప్రజాస్వరం):**
తెలంగాణ రాష్ట్రానికి తానే రాజు.. తానే మంత్రి అని సీఎం రేవంత్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర రాజకీయాల్లో తనకు ఎవరూ పోటీ కాదనీ, ఎవరూ సాటిరారన్నారు. మరో పదిన్నరేళ్ల పాటు తెలంగాణకు తానే సీఎంగా ఉంటానని స్పష్టం చేశారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం.. గురువారం సాయంత్రం రాహుల్ గాంధీతో పాటు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో భేటీ అయ్యారు. సమావేశం ముగిసిన తర్వాత బయటకు వచ్చిన ఆయన అక్కడి మీడియాతో చిట్ చాట్ చేశారు. ఈ సందర్భంగా సీఎం కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ రాజకీయాలు హాట్ హాట్ గా కొనసాగుతున్నాయని చెప్పారు. ఎవరెన్ని కుట్రలు చేసినా వచ్చే కాంగ్రెస్ పార్టీకి, ప్రభుత్వానికి ఎలాంటి ఢోకా లేదన్నారు. ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ వైపే మొగ్గు చూపారన్న ఆయన.. నేడు విడుదల కానున్న ఫలితాల్లోనూ గత ఎన్నికల ఫలితాలే ..మిగతా 5లో



## మెజారిటీ స్థానాలు బీజేపీకే..

**కాంగ్రెస్ ప్రలోభాలకు తెరదీసింది**
**దేశమంతా కరీంనగర్ వైపు చూస్తోంది**
**కౌంటింగ్ వద్ద అప్రమత్తంగా ఉండండి**
**చిన్న పొరపాటు చేసినా నష్టపోతాం జాగ్రత్త**
**కార్పొరేటర్ అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లతో కేంద్ర మంత్రి బండి సంజయ్**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
కరీంనగర్ కార్పోషన్ ఫలితాల్లో మెజారిటీ స్థానాలు బీజేపీ కైవసం చేసుకోబోతుందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ధీమా వ్యక్తం చేశారు. యావత్ దేశమంతా కరీంనగర్ ఫలితాలవైపు చూస్తోందన్నారు. బీజేపీకి అనుకూల ఫలితాలు రాబోతున్నాయని, కరీంనగర్ కార్పొరేషన్ మేయర్ పీఠాన్ని కైవసం చేసుకుని చరిత్ర సృష్టించబోతున్నామని చెప్పారు. గురువారం కరీంనగర్ లోని ..మిగతా 2లో

## 44వేలకు పైగా జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు



**మరింత పారదర్శకంగా అక్రిడిటేషన్ ప్రక్రియ**
**అర్హులందరికీ న్యాయం**
**రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకూ అక్రిడిటేషన్ కార్డు అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. అక్రిడిటేషన్ కార్డుల జారీ విధానం, అక్రిడిటేషన్ కమిటీ ఏర్పాటు తదితర అంశాలపై గురువారం సచివాలయంలోని తన కార్యాలయంలో సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్ సిహెచ్. ప్రియాంక, సీఎం సిపిఆర్‌వో మల్సూర్‌లతో మంత్రి సుదీర్ఘంగా ..మిగతా 2లో

## రూ. 2200 కోట్ల ఆస్తిని కాపాడిన హైడ్రా

**మొండికుంట చెరువు పరిధిలో**
**11 ఎకరాల భూమి స్వాధీనం**
**రూ.2200 కోట్ల ప్రభుత్వ ఆస్తిపై**
**అక్రమ నిర్మాణాలు నేలమట్టం**
**శాటిలైట్ చిత్రాలతో ఆక్రమణల**
**గుర్తింపు.. హైడ్రా శాస్త్రీయ చర్యలు**
**స్వాధీనం చేసిన స్థలంలో పార్కులు,**
**చెరువు సుందరీకరణకు ప్రజల డిమాండ్**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
హైదరాబాద్‌లోని మాదాపూర్ హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్ సమీపంలో హైడ్రా మరోసారి తన ప్రతాపాన్ని చూపింది. మొండికుంట చెరువు , దాని పక్కనే ఉన్న ప్రభుత్వ భూములను కబ్జాదారుల నుండి విముక్తం చేస్తూ గురువారం భారీ ఆపరేషన్ నిర్వహించింది. ఈ చర్యలో ..మిగతా 3లో



## ఏ అధికారంతో ఆ నిర్మాణాలు తొలగించారు..?

**కంచె తీసి.. నివేదిక ఇవ్వండి**
**ఆక్రమణల కూల్చివేత, కబ్జాలను**
**అడ్డుకునే మీ ప్రయత్నం మంచిదే**
**కోర్టు విచారణలో ఉన్న నిర్మాణాల**
**జోలికి ఎందుకు వెళ్తున్నారు**
**హైడ్రాపై హైకోర్టు సీరియస్**


05

## నిన్న 'అథెంటికేషన్', ఈ రోజు 'ప్రివిలేజ్'...


02

**మీడియా ప్రతినిధులపై**
**తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన రాహుల్ గాంధీ**
**ప్రివిలేజ్ మోషన్ గురించి**
**ప్రశ్నించడంతో అసహనానికి గురి**
**'ప్రివిలేజ్' అన్నది ఈరోజు మీ కోడ్ వర్డా**
**అంటూ ఘాటు వ్యాఖ్య**
**నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, వృత్తి**
**గౌరవాన్ని కాపాడాలని మీడియాకు సూచన**
**ప్రభుత్వంపై చేసిన విమర్శల నేపథ్యంలో**
**రాహుల్‌పై చర్యలకు బీజేపీ యోచన**



# మెజారిటీ స్థానాలు బీజేపీకే..

**మొదటిపేజీ తరువాయి**

రాజశ్రీ గార్డెన్ లో బీజేపీ కార్పోరేటర్ అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లతో బండి సంజయ్ కుమార్ సమావేశమయ్యారు. బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షులు బాస సత్యనారాయణ, మాజీ మేయర్ సునీల్ రావు, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్ల రమేశ్, పార్టీ సీనియర్ నేతలు వాసాల రమేశ్, సాయిని మల్లేశం, గుజ్జ శ్రీను తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ... "కరీంనగర్ లో బీజేపీకి మెజారిటీ స్థానాలు రాబోతుండటంతో అధికార కాంగ్రెస్ పార్టీలో కలవరం మొదలైంది. ప్రలోభాలకు గురిచేసి బీజేపీ కార్పొరేటర్లను గుంజాలని చూస్తోంది. అప్పుడే కాంగ్రెస్ నేతలు ఫోన్లు చేస్తూ ప్రలోభాల స్కెచ్ కు తెరదీశారు. జాగ్రత్తగా ఉండండి."అని సూచించారు. పార్టీని మోసం చేస్తే కన్నతల్లిని మోసం చేసినట్లేనని చెప్పిన బండి సంజయ్ "అధికార పార్టీ ఆశలకు లోబడి ఎవరైనా కాంగ్రెస్ లోకి వెళితే తీవ్రమైన పరిణామాలుంటాయి. కార్యకర్తల ఆవేశాన్ని తట్టుకోవడం అసాధ్యం"అని హెచ్చరించారు. ఫలితాల సందర్భంగా కౌంటింగ్ కేంద్రం వద్ద అభ్యర్థుల తరపున ఏజెంట్లు ఏం చేయాలనే అంశంపై మాజీ మేయర్ సునీల్ రావు వివరించారు. కౌంటింగ్ ఏజెంట్ల దృష్టి అంతా బ్యాలెట్ పేపర్ మీదే ఉండాలని చెప్పారు. చర్చల పేరుతో, గొడవల పేరుతో దృష్టి మళ్లించేందుకు ప్రత్యర్థులు ప్లాన్ చేసే అవకాశముందని, వాటికి తావివ్వకుండా బ్యాలెట్ పైనే దృష్టి పెట్టాలన్నారు. ముఖ్యంగా కౌంటింగ్ కేంద్రంలో ఎవ్వరితోనూ గొడవ పడొద్దని, ఏదైనా అభ్యంతరం ఉంటే రాతపూర్వకంగా రాసి ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేయాలని చెప్పారు. ఈ ఎన్నికల్లో ప్రతి ఒక్క సీటు పార్టీకి అత్యంత ముఖ్యమనే విషయాన్ని గుర్తుంచుకుని ప్రతి క్షణం జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అనంతరం కార్పొరేటర్ అభ్యర్థులంతా బండి సంజయ్ కు ధన్యవాదాలు తెలిపారు "ఈ ఎన్నికల్లో మాకు టిక్కెట్లు ఇవ్వడమే కాకుండా మా గెలుపు కోసం మీరు పడ్డ కష్టాన్ని మరువలేం. ఈ ఎన్నికల్లో మీ కష్టం.. మీరందించిన సాయం... మీరందించిన సహకారం ఎనలేనిది." అని బండి సంజయ్ కు ధన్యవాదాలు చెప్పారు. ఎన్నికల్లో గెలిస్తే కరీంనగర్ నుండి కొండగట్టుకు పాదయాత్రగా వెళ్లి హనుమాన్ ను దర్శించుకుంటే బాగుంటుందని సూచన రాగా సమావేశానికి హాజరైన కార్పొరేటర్ అభ్యర్థులంతా అందరం కలిసే పాదయాత్రగా వెళ్లి హనుమాన్ ను దర్శించుకుందామని చేతులెత్తి సమ్మతిని తెలియజేశారు.

# లింక్స్‌తో లంకె

**మొదటిపేజీ తరువాయి**

స్థాయిలో పెరుగుతోంది.. ప్రేమికుల కోసం వెతుక్కునే వారే లక్ష్యంగా సైబర్ దాడులకు పాల్పడుతున్నారు.

ఇందులో భాగంగా గిఫ్ట్ ఆఫర్లు, డేటింగ్ అండ్ ఫ్రెండ్ రిక్వెస్ట్‌లు, ఫేక్ ప్రొఫైల్స్ పంపిస్తూ వల విసురుతున్నారు. అంతే కాదు స్మార్ట్‌గా లక్షల రూపాయలు దోచేస్తున్నట్లు పలు కేసులు పోలీసుల దృష్టికి వస్తున్నాయి.. సోషల్ మీడియా, డేటింగ్ యాప్‌లలో ఆకర్షణీయమైన ఫోటోలతో ఫేక్ అకౌంట్లు సృష్టించి ముందుగా స్నేహం పెంచుకుంటున్నారు సైబర్ క్రిమినల్స్. కొన్ని రోజుల చాట్ తర్వాత గిఫ్ట్ పంపాను.. కస్టమ్స్ క్లియరెన్స్ కోసం డబ్బులు పంపాలి.. అంటూ బాధితుల్ని నమ్మిస్తారు. విదేశాల నుంచి పార్సిల్ వస్తోందని చెప్పి వేల నుంచి లక్షల రూపాయలు వసూలు చేస్తున్న ఘటనలు పెరుగుతున్నాయి..

ఇలాంటి మోసాలే కాదు.. వాలెంటైన్ స్పెషల్ కాంబో, ఒకటి కొంటే ఒకటి ఫ్రీ అంటూ నకిలీ వెబ్‌సైట్లు సృష్టించి ముందుగానే చెల్లింపులు తీసుకుంటున్నారు. డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేసిన వెంటనే వెబ్‌సైట్ మాయమవుతోంది. రిఫండ్ కోసం సంప్రదిస్తే నాట్ రెస్పాండ్ మెసేజ్ ప్రత్యక్షమవుతుంది.. మరోవైపు సైబర్ క్రిమినల్స్ మరో తరహా మోసానికి సైతం తెరలేపుతున్నరు. కొంతమంది యువతతో స్నేహం పెంచుకుని వీడియో కాల్‌కు ఆహ్వానిస్తారు. వ్యక్తిగతంగా ఉన్న వీడియోలను రికార్డ్ చేస్తారు. ఆ తర్వాత వాటిని చూపించి బ్లాక్‌మెయిల్ చేస్తున్నారు. డబ్బులు ఇవ్వకపోతే వీడియోలను సోషల్ మీడియాలో పెడతామంటూ బెదిరింపులకు దిగుతున్నారు...



సో.. వాలెంటైన్స్ వేళ యువత జాగ్రత్తగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. తెలియని వ్యక్తుల ఫ్రెండ్ రిక్వెస్ట్‌లను అంగీకరించవద్దని చెబుతున్నారు. అనుమానాస్పద లింకులు క్లిక్ చేయవద్దంటున్నారు. ముందస్తు చెల్లింపులు చేయడానికి ముందు వెబ్‌సైట్ నిజస్వరూపం తెలుసుకోవాలని చెబుతున్నారు. ఒకవేళ ప్రయివేట్ వీడియోలతో ఎవరైనా బ్లాక్‌మెయిల్ చేసినట్లయితే భయపడకుండా వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలని సూచిస్తున్నారు.. ఆకర్షణీయమైన ఆఫర్లు, అతి తక్కువ ధరలు, త్వరగా డబ్బు పంపమని ఒత్తిడి చేయడం లాంటివి చేస్తే.. వాటిని కచ్చితంగా మోసంగానే గుర్తించాలంటున్నారు పోలీసులు..

# 18 లక్షల మెట్రిక్ టన్నుల అదనపు ధాన్యం తీసుకోండి

**మొదటిపేజీ తరువాయి**



సంబంధించి 53.73 లక్షల మెట్రిక్ టన్నులకు (ఎల్ఎంటీ) అనుమతించారని.. కానీ భారీగా పంట ఉత్పత్తి కావడంతో అదనంగా 18 ఎల్ఎంటీలు తాము సేకరించినందున ఆ మొత్తాన్ని 10 శాతం నూకతో ఎఫ్‌సీఐ సేకరించాలని కేంద్ర మంత్రికి వారు విజ్ఞప్తి చేశారు. 202425 యాసంగి పంటకు సంబంధించి 5 శాతం నూకతో అదనంగా 10 లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్ మిల్లింగ్‌కు అనుమతించాలని కేంద్ర మంత్రి జోషిని సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కోరారు. 202425 వానా కాలం పంటకు సంబంధించి కస్టమ్స్ మిల్లింగ్ రైస్‌కు ఈ ఏడాది ఫిబ్రవరి 28వ తేదీ వరకు గడువు నిర్దేశించారని, దానిని మరో రెండు నెలలు పాటు పొడిగించాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. భారత ఆహార సంస్థకు (ఎఫ్‌సీఐ) 201415 వానా కాలంలో సరఫరా చేసిన బియ్యానికి సంబంధించి తెలంగాణకు బకాయి పెట్టిన రూ.1,468.94 కోట్లను వెంటనే విడుదల చేయాలని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషిని సీఎం, రాష్ట్ర మంత్రి కోరారు. నాడు అదనపు లెవీ సేకరణకు సంబంధించిన మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించిందని కేంద్ర మంత్రి దృష్టికి వారు తీసుకెళ్లారు. నాడు సేకరణకు తాము రుణం తీసుకున్నామని.. దానికి వడ్డీ రూ.2 వేల కోట్లకుపైగా పెరిగిందని తెలియజేశారు. ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ యోజన కింద 2021, మే నుంచి 2022, మార్చి వరకు సరఫరా చేసిన అదనపు బియ్యం, 2022 ఏప్రిల్ నెలలో సరఫరా చేసిన బియ్యానికి సంబంధించిన బకాయిలు రూ.343.27 కోట్లను విడుదల చేయాలని కేంద్ర మంత్రికి సీఎం, రాష్ట్ర మంత్రి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఎంపీలు డాక్టర్ మల్లు రవి, సురేశ్ షెట్కార్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ అదనపు డైరెక్టర్ రోహిత్ సింగ్, కేంద్ర ప్రభుత్వ పథకాల సమన్వయకర్త డాక్టర్ గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు.

# నిన్న 'అథెంటికేషన్', ఈ రోజు 'ప్రివిలేజ్'...

- **మీడియా ప్రతినిధులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన రాహుల్ గాంధీ**
- **ప్రివిలేజ్ మోషన్ గురించి ప్రశ్నించడంతో అసహనానికి గురి**
- **'ప్రివిలేజ్' అన్నది ఈరోజు మీ కోడ్ వర్డా అంటూ ఘాటు వ్యాఖ్య**
- **నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, వృత్తి గౌరవాన్ని కాపాడాలని మీడియాకు సూచన**
- **ప్రభుత్వంపై చేసిన విమర్శల నేపథ్యంలో రాహుల్‌పై చర్యలకు బీజేపీ యోచన**



**న్యూఢిల్లీ (ప్రజాస్వరం):**

కాంగ్రెస్ అగ్రనేత, లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఇవాళ మీడియా ప్రతినిధులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తనపై అధికార పక్షం ప్రివిలేజ్ మోషన్ (సభా హక్కుల ఉల్లంఘన తీర్మానం) ప్రవేశపెట్టే అవకాశం ఉందన్న వార్తలపై ప్రశ్నించడంతో ఆయన అసహనానికి గురయ్యారు. నిష్పక్షపాతంగా వ్యవహరించాలంటూ జర్నలిస్టులకు హితవు పలికారు.

గురువారం పార్లమెంట్ ప్రాంగణం వెలుపల తన కారు వద్దకు వస్తున్న రాహుల్‌ను మీడియా ప్రతినిధులు చుట్టుముట్టారు. ప్రివిలేజ్ మోషన్ గురించి స్పందన కోరగా, ఆయన ఒక్కసారిగా ఆగ్రహంతో స్పందించారు. "ప్రివిలేజ్ అనేది ఈరోజు మీ కోడ్ వర్డా? ఈ పదాన్ని మీకు ఈరోజే ఇచ్చారా? నిన్న 'అథెంటికేషన్' అన్నారు, ఈరోజు 'ప్రివిలేజ్' అంటున్నారు. మీరేమీ పూర్తిగా బీజేపీ ఉద్యోగులు కాదు కదా. కాస్త నిష్పక్షపాతంగా పనిచేయడానికి ప్రయత్నించాలి" అని ఘాటుగా వ్యాఖ్యానించారు. "మీడియాగా మీకు ఒక బాధ్యత ఉంది, వృత్తి గౌరవాన్ని కాపాడాలి" అని ఆయన సూచించారు.

నిన్న లోక్‌సభలో మోదీ ప్రభుత్వంపై రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేసిన విషయం తెలిసిందే. భారతమాతను, దేశ ప్రయోజనాలను విదేశీ శక్తులకు తాకట్టు పెట్టారని ఆయన ఆరోపించారు. రాహుల్ వ్యాఖ్యలు పార్లమెంటరీ నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని, ఆధారం లేని ఆరోపణలతో సభను తప్పుదోవ పట్టించారని ఆరోపిస్తూ ఆయనపై ప్రివిలేజ్ మోషన్ తెస్తామని బీజేపీ ఎంపీలు హెచ్చరించారు.

అయితే, కాంగ్రెస్ పార్టీ రాహుల్‌కు అండగా నిలిచింది. ఇండోయూఎస్ వాణిజ్య ఒప్పందంలో ప్రభుత్వ వైఫల్యాలను విమర్శించే హక్కు ప్రతిపక్ష నేతకు ఉందని స్పష్టం చేసింది. కాగా, రాహుల్‌పై ప్రివిలేజ్ మోషన్ విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. అయితే, దీనికి బదులుగా ఆయనపై సబ్‌స్టాంటివ్ మోషన్ (వ్యక్తిగత ప్రాతిపదికన ఇచ్చే నోటీసు) ప్రవేశపెట్టే అవకాశాలను ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

# వారిద్దరి పాలనలో ఉద్యమకారులు, అమరవీరులకు అన్యాయం

**మొదటిపేజీ తరువాయి**

అని విమర్శించారు. గురువారం హైదరాబాద్ లోని బాగ్ లింగంపల్లిలో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఉద్యమకారుల ఆత్మగౌరవ సభలో కవిత మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఉద్యమకారులకు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు రాబోయే బడ్జెట్‌లో నిర్ణయం ప్రకటించాలని డిమాండ్ చేశారు. అలా ప్రకటించకుంటే ఊరుకునేది లేదన్న కవిత.. ఈ హెచ్చరిక సీఎం రేవంత్ రెడ్డితో పాటు ప్రొఫెసర్ కోదండరామ్‌కూ వర్తిస్తుందన్నారు. ప్రొఫెసర్ కోదండరాం, మాజీ ఐఏఎస్ ఆకునూరి మురళి రేవంత్ రెడ్డితో కలవటంతోనే తనతో పాటు ప్రజలందరూ కాంగ్రెస్‌ను నమ్మారన్నారు. అయినా కాంగ్రెస్ అధికారంలో వచ్చి రెండున్నరేళ్లయినా ఉద్యమకారుల విషయంలో వారిద్దరు ఎందుకు మాట్లాడటం లేదని మండిపడ్డారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే రేవంత్ రెడ్డిని బిల్డింగ్ బయటికి గుంజుతామన్నారు. శ్రీ కృష్ణుడు సైతం ధర్మం వైపు ఉండాలని చెప్పారన్నారు. ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాల వైపే ధర్మం ఉంది. వారి కోసం పోరాటం చేస్తామన్నారు. ప్రైవేట్ ఉద్యోగాల్లో తెలంగాణ బిడ్డలకు 20 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. నిజానికి రాష్ట్రం రాగానే ఉద్యమకారులందరికీ మొదటి వరుసలోనే గౌరవం, ఆర్థిక వృద్ధి, రాజకీయ అవకాశాలు వస్తాయని భావించామన్నారు. కానీ ఆ విధంగా జరగకపోవటం చాలా బాధ కలిగించే అంశం అన్నారు. మన తెలంగాణ అనేది నిత్యం పోరాటాల గడ్డ అన్ని చెప్పారు. కేబీఆర్ పార్క్ వద్ద జయశంకర్ సార్ విగ్రహం పెట్టాలని అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ను ఎన్నోసార్లు కోరానన్నారు. అయినా ట్యాంక్ బండ్ పై కూడా జయశంకర్ సార్ విగ్రహం పెట్టుకోలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు.

**బీఆర్ఎస్ పాలనలో చేదు అనుభవాలే..**

కలిసొచ్చే కాలానికి నడిచొచ్చే కొడుకు పుట్టినట్లు ఉద్యమం అనే అగ్గి పుట్టాక 2001లో కేసీఆర్ పార్టీ పెట్టి ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లారని కవిత చెప్పారు. 1995లోనే వరంగల్ డిక్లరేషన్‌తో మలిదశ ఉద్యమం మొదలైందని ఈ ఉద్యమంలో మారోజు వీరన్న, గద్దర్ లాంటి ఎంతోమంది విప్లవకారులు, ప్రజాసంఘాల నాయకులు కీలకంగా వ్యవహరించారని చెప్పారు. త్వరలోనే రాజకీయ పార్టీ పెట్టబోతున్నట్లు కవిత వెల్లడించారు పదేళ్లు బీఆర్ఎస్ కు ఉద్యమకారులు అధికారం ఇస్తే అన్ని చేదు జ్ఞాపకాలే మిగిలాయన్నారు. ఉద్యమకారులకు న్యాయం జరగలేదని ఈ విషయంలో ఉద్యమకారులు బయట ఉండి బాధపడితే తాను బీఆర్ఎస్‌లో ఉండి బాధపడ్డానన్నారు. మనవాళ్లే గాయం చేయటంతో నొప్పి ఎక్కువగా ఉంది. ఉద్యమకారుల కోసం మరో ఉద్యమం చేయాల్సి ఉందన్నారు. త్వరలోనే రాజకీయ పార్టీ పెట్టబోతున్నామని ప్రకటించారు. మాది ఫక్తు రాజకీయ పార్టీ కాదని తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడే పార్టీ అన్నారు. అహంకారం, సహనశీలత లేకపోవటంతోనే బీఆర్ఎస్ అధికారం కోల్పోయిందని, మంచితనం, సహనశీలత, భోళాతనం తెలంగాణ తత్వం అన్నారు. అవి కోల్పోతే మనల్ని మనం కోల్పోయినట్లేనని చెప్పారు.




# 44వేలకు పైగా జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు

**మొదటిపేజీ తరువాయి**

చర్చించారు. ప్రక్రియ పారదర్శకంగా, వేగవంతంగా సాగేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. అక్రిడిటేషన్ కార్డుల జారీకి సంబంధించి ప్రభుత్వం ముందుగా జి.ఓ. 252 జారీ చేసినట్లు తెలిపారు. తర్వాత జర్నలిస్టు సంఘాలతో సమావేశమై వారి సూచనలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని అవసరమైన సవరణలు చేసి జి.ఓ. 103ను జారీ చేసినట్లు వెల్లడించారు. ఈ సవరణల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా మరియు డిజిటల్ మీడియా విభాగాల్లో మొత్తం 44,706 అక్రిడిటేషన్ కార్డులు పొందే అవకాశం కలుగుతుందని తెలిపారు. గతంలో సుమారు 23 వేల మందికి మాత్రమే అక్రిడిటేషన్ కార్డులు ఉండగా, తాజా నిర్ణయంతో దాదాపు 21 వేలకు పైగా కార్డుల సంఖ్య పెరుగుతుందని మంత్రి వివరించారు. 2.50 లక్షల పైగా సర్క్యులేషన్ ఉన్న ఎనిమిది పత్రికలకు 6,256 కార్డులు, 75 వేల నుండి 2.50 లక్షల వరకు సర్క్యులేషన్ ఉన్న24 పత్రికలకు 17,784 కార్డులు , 25,001 నుంచి 75 వేల వరకు సర్క్యులేషన్ ఉన్న 30 పత్రికలకు 3,390,15,001 నుంచి 25వేల వరకు సర్క్యులేషన్ ఉన్న 169 చిన్న పత్రికలకు 11,661 , 15వేలలోపు సర్క్యులేషన్ ఉన్న 113 చిన్న పత్రికలకు 226, పీరియాడికల్స్‌కు 624,20 న్యూస్ ఏజెన్సీలకు 68 అక్రిడిటేషన్‌లు పొందుతాయని తెలిపారు.

21 శాటిలైట్ ఛానళ్లకు 4,431 కార్డులు, ఎనిమిది జాతీయ ఛానల్స్‌కు 32, వంద లోకల్ కేబుల్ ఛానళ్లకు 200 ,డిజిటల్ మీడియా విభాగానికి 10 కార్డులు మొత్తంగా 44,706 కార్డులు కేటాయించినట్లు తెలిపారు. ఇందులో రాష్ట్రం, జిల్లా స్థాయిలో 16,056, నియోజకవర్గ, మండల స్థాయిలో 28,650 మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. అక్రిడిటేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని, అవసరాన్ని బట్టి మరోసారి సమావేశమై తదుపరి చర్యలు తీసుకోవాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. ప్రజాస్వామ్యంలో నాలుగో స్థంభంగా ఉన్న మీడియా ప్రతినిధుల గౌరవం, భద్రత, సంక్షేమం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.



# రూ. 2200 కోట్ల ఆస్తిని కాపాడిన హైడ్రా

**మొదటిపేజీ తరువాయి**

భాగంగా సుమారు 11 ఎకరాల అత్యంత విలువైన ప్రభుత్వ భూమిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న ఈ ఆస్తి విలువ బహిరంగ మార్కెట్లో సుమారు రూ. 2200 కోట్లు ఉంటుందని హైడ్రా ప్రాథమికంగా అంచనా వేసింది.

సర్వే నంబర్ 53లోని మొండికుంట చెరువు పరిధి , సర్వే నంబర్ 55లోని ప్రభుత్వ భూమిని ఆక్రమించి ఏళ్ల తరబడి అక్రమ వ్యాపారాలు సాగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. చెరువు FTL పరిధిలోని ఒక ఆలయాన్ని హద్దుగా చూపించి, కబ్జాదారులు తెలివిగా ఆక్రమణలకు పాల్పడ్డారు. అక్కడ వందలాది తాత్కాలిక షెడ్లు, 30కి పైగా పక్కా షాపులను నిర్మించి, వాటి ద్వారా నెలకు లక్షలాది రూపాయల అద్దెలు వసూలు చేస్తున్నట్లు విచారణలో తేలింది. వీటిలో ప్రధానంగా మెకానిక్ షెడ్లు, ఐరన్ , స్టీల్ దుకాణాలు ఉన్నట్లు గుర్తించిన అధికారులు, జేసీబీలతో వాటిని నేలమట్టం చేశారు.

ఈ ఆక్రమణల నిర్ధారణ కోసం హైడ్రా శాస్త్రీయ పద్ధతులను అనుసరించింది. ఈ ఏడాది జనవరి 31న రెవెన్యూ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టిన హైడ్రా, ఎన్ఆర్ఎస్సీ (NRSC) శాటిలైట్ చిత్రాలను క్షుణ్ణంగా పరిశీలించింది. గత కొన్ని ఏళ్లలో చెరువు ఆక్రమణకు గురైన తీరును శాటిలైట్ చిత్రాల ఆధారంగా నిర్ధారించుకున్నాకే ఈ చర్యలకు పూనుకుంది. అయితే, ఈ కూల్చివేతలకు ముందే కబ్జాదారులకు నోటీసులు ఇచ్చి, సామాగ్రిని తరలించుకోవడానికి గడువు ఇచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

హైడ్రా కమిషనర్ రంగనాథ్ నేతృత్వంలో భారీ పోలీసు బందోబస్తు మధ్య ఈ కూల్చివేతలు జరిగాయి. ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవడం పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. స్వాధీనం చేసుకున్న ఈ 11 ఎకరాల స్థలంలో ప్రజా అవసరాల కోసం పార్కులు అభివృద్ధి చేయాలని, అలాగే మొండికుంట చెరువును ప్రక్షాళన చేసి సుందరీకరించాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.






## జిల్లాస్థాయి సీఎంకప్ క్రీడల్లో ZPHS బేలా విద్యార్థిని ప్రతిభ

**ఆదిలాబాద్ జిల్లా ఫిబ్రవరి 12 (ప్రజాస్వరం):-**



జిల్లాస్థాయి సీఎంకప్ క్రీడా పోటీలలో ZPHS బేలా పాఠశాలకు చెందిన విద్యార్థిని జి. శృతి విశేష ప్రతిభను కనబరిచింది. లాంగ్ జంప్ విభాగంలో మొదటి బహుమతిని, రన్నింగ్ పోటీలో రెండవ బహుమతిని సాధించి పాఠశాలకు గర్వకారణంగా నిలిచింది. విద్యార్థిని సాధించిన ఈ విజయంపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొమ్ము కృష్ణ కుమార్, వ్యాయామ ఉపాధ్యాయురాలు శ్రీమతి వందనతో పాటు ఉపాధ్యాయ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. శృతిని అభినందిస్తూ, భవిష్యత్తులో కూడా ఇలాంటి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.




# కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలి..

**తూప్రాన్ ఫిబ్రవరి 12 (ప్రజా స్వరం)**




తూప్రాన్ లో వ్యవసాయ రైతు వ్యతిరేక విధానాలు నశించాలి దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె పిలుపు తో ర్యాలీ నిర్వహించి ఆర్డీఓ కు వినతి పత్రాన్ని అందజేశం అని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఏ. మహేందర్ రెడ్డి తెలిపారు కేంద్ర ప్రభుత్వ ప్రజా కార్మిక రైతు వ్యతిరేక విధానాలకు నశించాలి నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలి ఉపాధి హామీ చట్టాన్ని పరిరక్షించాలని రైతాంగ సమస్యను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఏ మహేందర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు గురువారం తూప్రాన్ పట్టణంలో సిఐటియు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి ఆర్డిఓ ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించి ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఏ. మహేందర్ రెడ్డి మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న 29 చట్టాలను రద్దుచేసి తెచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల ను కారు చౌకగా కార్పొరేట్ శక్తులకు అమ్ముతూ దేశ సార్వభౌమత్వాన్ని తాకట్టు పెడుతున్నారని ఆరోపించారు. కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలని ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని ఉపాధి హామీ చట్టాన్ని కాపాడాలని వి.భ.జీ రాంజీ పథకాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు వ్యతిరేకంగా తెచ్చిన విత్తన విద్యుత్ సవరణ చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ కార్మికులు, అంగన్వాడీ వర్కర్స్, వివోఏ, ఆశ వర్కర్స్, మధ్యాహ్నం భోజనం, ఆర్పీలు ,హాస్పిటల్ వర్కర్స్, భవన నిర్మాణ,హమలి కార్మికుల, మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వారికి కనీస వేతనం 26000 నిర్ణయించాలని ఆశలకు ఫిక్స్డ్ వేతనం నిర్ణయించి వేతనాలు ఇవ్వాలని , వివో ఏ ఆర్ పి లకు. సెర్ఫ్ ద్వారా కనీస వేతనం నిర్ణయించి ఇవ్వాలని అన్నారు, గ్రామపంచాయతీ కార్మికులకు మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, మధ్యాహ్నం భోజనం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, భావన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డు పరిరక్షించాలని, పెండింగ్లో ఉన్న క్లెయిమ్స్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు, కార్మికులపై అధికారుల వేధింపులను అరికట్టాలని, పిఎఫ్, ఈఎస్ఐ ప్రమాద బీమా సౌకర్యం ప్రతి కార్మికుడికి కల్పించాలని కార్మిక హక్కుల రక్షణ కోసం ప్రతి ఒక్క కార్మికులు పోరాటంలో పాల్గొనాలని పోరాటం ద్వారానే హక్కులు సాధించుకోవడం జరుగుతుందని అన్నారు.ఈ సందర్భంగా ఉదయం నుండే తూప్రాన్ మండలంలో ఉన్న పలు పరిశ్రమలను బందు చేయించడం జరిగిందని ఆయన అన్నారు. పలు రంగాల డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తూప్రాన్ ఆర్డీవో కార్యాలయంలో డీఏవో గారికి ఇవ్వడం జరిగింది.

ఈ కార్యక్రమం లో ఆగన్వాడీ యూనియన్ నాయకురాలు ఇందిరా, గ్రామపంచాయతీ యూనియన్ మండల అధ్యక్షులు మహేష్, హాస్పిటల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి లక్ష్మి ఆర్ పిల యూనియన్ కార్యదర్శి విజయలక్ష్మి. వివో ఎలా యూనియన్ కార్యదర్శి కవిత, మున్సిపల్ వర్కర్ల యూనియన్ అధ్యక్షులు బాబు ఎల్లం, యాదయ్య, నాగరాజు,సరితా, సురేష్, బలమని, సంపూర్ణ, శ్రీకాంత్ ,స్వామి,బాలయ్య, వివిధ రంగాల కార్మికులు తదితరులు పాల్గొన్నారు

## కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలి

- **సిఐటియు నాయకుల డిమాండ్ ధర్నా రాస్తారోకో చేపట్టిన కార్మికులు**

**చిన్న శంకరంపేట ఫిబ్రవరి 12 ( ప్రజాస్వరం )**

దేశవ్యాప్త కార్మికుల సమ్మెలో భాగంగా సిఐటియు ఆధ్వర్యంలో చిన్న శంకరంపేట మండల కేంద్రంలోని మెదక్ చేగుంట రహదారిపై రాస్తారోకో ధర్నా, చేపట్టారు, ఈ సందర్భంగా సిఐటియు నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికులకు తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోర్టులు వెంటనే వెనక్కి తీసుకోవాలని రైతంగానే దెబ్బతీసే విత్తన బిల్లు విద్యుత్ సవరణ బిల్లు రాంజీ చట్టం లాంటి చట్టాలు అత్యంత ప్రమాదకరంగా ఉన్నాయని కార్మికుల జీవితాలను ప్రశాంతంగా మార్చనున్నాయని వారు తెలిపారు, నాలుగు లేబర్ కోర్టులో కార్పొరేట్లకు అనుకూలంగాను కార్మికులకు వ్యతిరేకంగా ఉన్నాయని వారు విమర్శించారు, పోరాటం ద్వారా సాధించుకున్న 29 కార్మిక చట్టాలను మోడీ ప్రభుత్వం రద్దుచేసి వాడి స్థానంలో కార్మికుల హక్కులను అణిచివేయడానికి నాలుగు లేబర్ కోడ్లను తీసుకువచ్చిందని వారు అన్నారు కార్మికులకు ఈపీఎఫ్ ఈఎస్ఐ పెన్షన్ వంటి సామాజిక భద్రత పథకాలను ఏర్పాటు చేయాలని ఆశా వర్కర్లకు కనీస వేతనాలు చెల్లించాలని వారి, మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక కర్షక ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జాతీయ కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపులో భాగంగా వివిధ సంఘాలకు సంబంధించిన కార్మికులు ఆందోళనలకు దిగారు, ఈ కార్యక్రమంలో సిఐటియు సహాయ కార్యదర్శి గౌరయ్య, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అజయ్ కుమార్, జిల్లా కమిటీ సభ్యుడు నరేందర్ రెడ్డి ఆశ వర్కర్ల సంఘం అధ్యక్షురాలు దేవమ్మ, నాగమణి, సంతోష, కల్పన, విజయలక్ష్మి, వనిత, ఏసుమని, రాజమణి తదితరులు పాల్గొన్నారు



## తూప్రాన్ మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ ఏర్పాట్లు పూర్తి... ఆర్డీఓ జయ చంద్ర రెడ్డి




**తూప్రాన్ ఫిబ్రవరి 12 (ప్రజా స్వరం)**

తూప్రాన్ మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ లో భాగంగా, తూప్రాన్ డివిజన్ పరిధిలోని మనోహరాబాద్ మండలం, లింగారెడ్డిపేట్ గ్రామంలో ఏర్పాటు చేసిన తూప్రాన్ మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ గ్లోబల్ కాలేజ్ సెంటర్ లో ఏర్పాట్లు పూర్తి ఆర్డీఓ జయంతి చంద్ర రెడ్డి తెలిపారు శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా సెక్షన్ 163 అమలు చేయబడినది. రేపు అనగా 13022026 తేదీన జరగనున్న కౌంటింగ్ ప్రక్రియ సందర్భంగా, ఉదయం 6.00 గంటల నుండి కౌంటింగ్ పూర్తయ్యే వరకు కౌంటింగ్ సెంటర్ పరిధిలో: నలుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుంపులుగా చేరడం నిషేధం కర్రలు, రాళ్లు, ఇటుకలు, గొలుసులు తదితర ఆయుధాలు తీసుకురావడం నిషేధం అని RDO జయ చంద్రా రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఇందుకు ప్రజలు సహకరించి ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ సజావుగా జరగడానికి సహకరించవలసిందిగా ఆర్డీఓ కోరనైనది.




**నేదునూరి మాట**

# నీ మాటే నీ సైన్యం

**కరీంనగర్/ హైదరాబాద్( ప్రజాస్వరం)**

నీ మాటే నీ సైన్యం
నీ మాటే నీ భలం
నీ భలగం నీ ఉన్నతి
మాటతో మంచి తనం
మనిషి తనం పరిమళిస్తుంది
మాట మనిషికి దేవుడిచ్చిన
వరం మాటతో ఆర్ధత ఆత్మీయత
మాటకీ లాంటిది కీతో లాక్
తీయొచ్చు మంచి మాటలతో
ఇతరుల హృదయాలను
గెలువ వచ్చు
మాటతో ఇతరుల నోరు
మూయించవచ్చు
మాటే నీ మంత్రం
మాటే నీ తంత్రం
మాటే నీసైన్యం మాటే నీధైర్యం
మాటే నీ ఆయుధంమాటే నీ వృద్ధి
అభివృద్ధి మాటే నీ ప్రగతి
పురోగతి మాటే నీ మనోదర్పణం
మాటే నీగుర్తింపు మాటే నీఉనికి
మాటే తో నీవ్యక్తిత్త్వ
వికాసం మాటే మార్పుకు
మార్గదర్శి మంచిమాటల
మల్లెలతో మానవీయతను
చాటుదాం
ఆత్మీయ అనుబందాలను
మాటల మమతల
పూతోటలో మరిచి పోని
మరువలేని ఆప్యాయతలను
ఆవిష్కరిద్ధాం
సమత సహనం సంఘీభావం
సౌభ్రాతృత్వం సామరస్య
సమరసత పునాదుల మీద
ప్రగతి శీల దృక్పథంతో
మెరుగైన సమాజానికి
పునాది వేద్దాం
మాటే మానవ
వికాసానికి చోదక శక్తి
అని చాటుదాం.

నేదునూరి కనకయ్య
అధ్యక్షులు
అధ్యక్షులు తెలంగాణ
ఎడ్యుకేషన్ పోరం
కరీంనగర్ 9440245771



## తపస్ మెదక్ జిల్లా కమిటీలో కౌడిపల్లి ఉపాధ్యాయులకు చోటు..

**కౌడిపల్లి, ఫీబ్రవరి 12 ( ప్రజా స్వరం )**



తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా ఉపాధ్యక్షులుగా నాయిని నరేందర్ గౌడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముట్రాజ్ పల్లి, ఈగ కృష్ణమూర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాయిలాపూర్, జిల్లా కార్యదర్శిగా మంద సుభాష్ ఎంపీపీఎస్ పాముపల్లి,నావత్ చంద్ర శేఖర్ అభిలేఖన్ విభాగం జిల్లా కన్వినర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెల్మకన్నే కౌడిపల్లి మండలం నుండి నియామకమైనట్లు మెదక్ జిల్లా తపస్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జిడ్డి ఎల్లం,జలా సిద్దు తెలిపారు. ఈ సందర్భంగా వారు తపస్ అభివృద్ధికి, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వారన్నారు. వారి నియామకం పట్ల కౌడిపల్లి మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ప్రభాకర్ స్వామి అభినందనలు తెలియజేశారు

## సమ్మెలో పాల్గొన్న భవన నిర్మాణ కార్మిక సంఘం

**జవహర్ నగర్, ఫిబ్రవరి 12, (ప్రజాస్వరం):**

జిల్లా భవన నిర్మాణా మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి దర్శనం యాదగిరి ఆద్వర్యంలో గురువారం సార్వతిక సమ్మె సందర్భంగా జవహర్నగర్ లో ఏఐటీయూసీ,సిఐ టీ యు సి సంఘాలు పాల్గొని నిరసన తెలిపారు జిల్లా ముఖ్య అతితులు జిల్లా కార్యవర్గ సభ్యులు టి శంకర్ మాట్లాడుతూ.. 4 లేబర్ కోడ్లను రద్దు చెయ్యాలని 8 గంటల పని దిన్నని కొనసాగించాలీ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి అవుట్ సోర్సింగ్ కార్మికులకూ 25 వేలు ఇవ్వాలి అని కంపెనీలో పనిచేసే కార్మికులకు 8 గంటల పని దినాలు కొనసాగించాలన్నారు .ఈ కార్యక్రామం లో సిపిఎం నాయకులు నగేష్,సిఐటియు నాయకులు శ్రీమాన్ నారాయణ ఏ ఐ టి యు సి నాయకులు అంబాల ఎల్లయ్య, గిరిజన సమైక్య అధ్యక్షురాలు శ్యామల లత ,ప్రధాన కార్యదర్శి వి స్వరూప ,శాఖ కార్యదర్శి సత్యం సాగర్, సహాయ కార్యదర్శి నాని, ఏ ఐ టి యు సి నాయకులు సి హెచ్ ఎల్లయ్య, శ్యామ్ దాస్, మహిళా సమాఖ్య నాయకురాలు కోడస్ జయమ్మ, మల్లికా,నగేష్,సతీష్ ,యన్ శ్రీను, యం నర్సింగ్,అశోక్ తదితరులూ పాల్గొన్నారు.




## కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ భారీ ప్రదర్శన

- **సార్వత్రిక సమ్మే విజయవంతం కార్మిక, ప్రజా సంఘాల నేతలు.**

**జవహర్ నగర్,ఫిబ్రవరి12, (ప్రజాస్వరం):**

నాలుగులేబర్ కోడ్లు, మూడు రైతు వ్యతిరేక, విబిజీ రామ్ జీ, విత్తన బిల్లు, విద్యుత్ సవరణ బిల్లు2025 చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జవహర్ నగర్ లో కార్మిక, ప్రజా సంఘాలు గురువారం భారీ ప్రదర్శనను నిర్వహించాయి. గురువారం రోజు జరిగిన అఖిల భారత సమ్మెలో బాగంగా బాలాజీనగర్ లో బారీ ప్రదర్శనలో పాల్గొన్న ఐ.ఎఫ్.టి.యు. నేత షేక్ షావలి మాట్లాడుతూ.. కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాల వలన ఆకలి, దారిద్ర్యం, నిరుద్యోగం సమస్యలు దేశంలో ఉన్నాయన్నారు. సిఐటియు శివన్నారాయణ మాట్లాడుతూ.. సామ్రాజ్యవాదులకు, బడా కార్పొరేట్ సంస్థలకు దేశాన్ని తాకట్టుపెట్టే చర్యలు బావి తరాల వారిపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోందన్నారు. కార్యక్రమంలో ఆదర్శ పంచాయతీ,మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఇఫ్టూ శివబాబు ఏ.ఐ.ఎఫ్.టి.యు. వై.మల్లేష్, రాము, పిఓడబ్ల్యూ(విముక్తి) పెర్క సునీత, పీఓడబ్ల్యూ జయ సుధ,భవన నిర్మ వికలాంగుల కాలనీ భూడిద వెంకటేష్,భవన నిర్మాణ సంఘం కొయ్యాడ వెంకటేష్, సిఐటియు డి.నాగేష్,బాలు, తెలంగాణ కళాకారుల వేదిక టి.రాణి, ఫాతిమా,బాలమణి, పద్మ తదితరులు పాల్గొన్నారు.



# తుంకి ఖాల్సాలో ప్రజాబాట కార్యక్రమం

**గజ్వేల్ ఫిబ్రవరి 12 (ప్రజాస్వరం)**

వర్గల్ మండలం తుంకి ఖాల్సాలో తెలంగాణ ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రతి మంగళవారం, గురువారం, శనివారం నిర్వహిస్తున్న "ప్రజా బాట" కార్యక్రమం భాగంగా సిద్దిపేట జిల్లా లోని వర్గల్ మండలం తునికికల్స గ్రామంలో కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఇంజనీర్ (రూరల్ జోన్) బాలస్వామి సూపరింటెండింగ్ ఇంజనీర్ సిద్దిపేట చంద్రశేఖర్ డివిజనల్ ఇంజనీర్ గజ్వేల్ భానుప్రకాశ్, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ ములుగు శ్రీనివాస్, అసిస్టెంట్ ఇంజనీర్ వర్గల్ వాసుదేవరావు సర్పంచ్ తునికికల్స గణేష్, ఉప సర్పంచ్ లక్ష్మీ కొండల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రజాబాట కార్యక్రమం ద్వారా విద్యుత్ శాఖ అధికారులు గ్రామాలను సందర్శించి విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు తదితర సమస్యలను పరిశీలించి తక్షణ పరిష్కారం చేస్తున్నారు. అలాగే గ్రామ ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఇంజనీర్ బాలస్వామి తునికికల్స గ్రామ ప్రజలతో సమావేశమై వారి సమస్యలను తెలుసుకొని, వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సర్పంచ్ మరియు ఉప సర్పంచ్ సింగిల్ ఫేజ్ డిటిఆర్ మరియు కొత్త స్ట్రీట్ లైన్ పనుల గురించి ముఖ్య ఇంజనీర్ గారికి



వివరించగా, వాటిని పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.వచ్చే వేసవి కాలంలో పెరిగే విద్యుత్ డిమాండ్ దృష్ట్యా వర్గల్ మండలంలో అవసరమైన ఏర్పాట్లు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. 11 కేవీ అంబర్‌పేట్ నుంచి 11 కేవీ తునికికల్స ఫీడర్‌కు ఇంటర్‌లింకింగ్ లైన్ పనులు కోసం రూ.20 లక్షల వ్యయంతో పూర్తిచేశారు. అలాగే సీతారాంపల్లి సబ్‌స్టేషన్‌లో 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. మజీద్‌పల్లి సబ్‌స్టేషన్‌లో మరో 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఈ వారం చివరి నాటికి ఏర్పాటు చేయనున్నారు. అలాగే 11 కేవీ నెంటూర్ మరియు జబ్బాపూర్ ఫీడర్ల విభజన పనులు కొనసాగుతున్నాయి. ఇవి ఈ నెల 15 వ తేదీకి ముందుగా పూర్తి చేయనున్నట్లు తెలిపారు. వేసవి అవసరాలను దృష్టిలో ఉంచుకొని గతవారం వర్గల్ మండలంలో 12 సింగిల్ ఫేజ్ 25 కేవీఏ డిటిఆర్‌లు కూడా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా గౌరవ ముఖ్య ఇంజనీర్ తునికికల్స గ్రామ ప్రజలకు, వర్గల్ మండల ప్రజలకు విద్యుత్ సంబంధిత సమస్యలు ఉన్నప్పుడు ప్రజాబాట కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని, సంబంధిత సిబ్బందికి తెలియజేయాలని సూచించారు. తద్వారా నిర్ణీత సమయంలో సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమం ముగింపులో తునికికల్స గ్రామ అసిస్టెంట్ లైన్మన్ నవీన్ గ్రామానికి చేసిన ఉత్తమ సేవలకుగాను గౌరవ ముఖ్య ఇంజనీర్ గారు శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ సిబ్బంది నర్సింహులు, చంద్రం, నవీన్, అశోక్, చందు, స్వామి తదితరులు పాల్గొన్నారు



# 15వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించిన అధికారులు...

**చిన్న శంకరంపేట ఫిబ్రవరి 12 ( ప్రజాస్వరం)**

చిన్న శంకరంపేట మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో 15వ విడత సామాజిక తనిఖీలో భాగంగా ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు మండలంలోని వివిధ గ్రామాలకు సంబంధించిన 2024 2025 కు సంబంధించి ఏడుకోట్ల 56 లక్షల 74,137 రూపాయలకు సంబంధించిన రికార్డుల తనిఖీలు నిర్వహించారు, వాటిలో మొత్తం 345 పనులకు సంబంధించి కూలీలకు చెల్లించిన ఆరు కోట్ల 36 లక్షల 44,793 రూపాయలు కూలీలకు చెల్లించినట్టు ఒక కోటి 20,29,344 మెటీరియల్ కొనుగోలు చేసినట్టు లెక్కలు చూపించారు, వీటికి సంబంధించి 28 వేల ఎనిమిది వందల అరవై రూపాయలు రికవరికి ఆదేశాలు జారీ చేసినట్లు, 5వేల రూపాయలు పెనాల్టీ విధించినట్లు అధికారులు ఆదేశాలు జారీ చేశారు, అదేవిధంగా ఎస్ కొండాపూర్ ఎఫ్ఏకు శోకజ్ నోటీసులు జారీ చేశారు, కొండాపూర్ ఎఫ్ఏ అవకతవకలకు పాల్పడ్డాడని ఆరోగ్యం బాగాలేక మంచానికే పరిమితమైన వ్యక్తిపై పనిచేసినట్టు రికార్డు చేసి డబ్బులు తీసుకోవడం జరిగిందని సుమారు ఏడుగురు కూలీల పైన లక్ష రూపాయల పైన డబ్బులు తీసుకున్నట్లు తనిఖీలో తేలింది, నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఫీల్డ్ అసిస్టెంట్ కు అధికారులు నోటీసులు అందజేశారు, ఆయనపై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ పిడి రంగాచార్యులు, డీవీవో శ్రీహరి, హెచ్ఆర్ మేనేజర్ రాజేందర్ రెడ్డి, ఎంపీడీవో దామోదర్, ఎస్టియం అంజాగౌడ్, ఎస్ఆర్పి నాగరాజు, ఏపీవో రాజ్ కుమార్, ఈజీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు





# జీడిమెట్ల,గాంధీనగర్ పారిశ్రామిక వాడల్లో సమ్మె విజయవంతం




- **నూతన లేబర్ కోడ్ల రద్దు డిమాండ్‌తో కార్మికుల భారీ ప్రదర్శన**
- **లేబర్ కోడ్లు రద్దు చేయాలి...పారిశ్రామిక వాడల్లో కార్మిక శక్తి ప్రదర్శన!**

**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 12: (ప్రజాస్వరం)**

షాపూర్ నగర్‌లో బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన లేబర్ కోడ్లను రద్దు చేయాలని దేశవ్యాప్తంగా జాతీయ కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు జీడిమెట్ల, గాంధీ నగర్ పారిశ్రామిక వాడల్లో గురువారం జరిగిన సమ్మె విజయవంతమైంది. పరిశ్రమల యాజమాన్యాలు స్వచ్ఛందంగా బంద్ ఇవ్వడంతో కార్మికులు పెద్ద ఎత్తున సమ్మెలో పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు. షాపూర్ నగర్‌లో నిర్వహించిన ప్రధాన కార్యక్రమానికి ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు స్వామి నాయకత్వం వహించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్, సిఐటియు నాయకులు అంజయ్య, టీయూసిఐ నాయకులు ప్రవీణ్, ఏఐఎఫ్‌టీయూ నాయకురాలు పద్మక్క తదితరులు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు వక్తలు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం పెట్టుబడిదారులకు అనుకూలంగా కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని విమర్శించారు. నూతన లేబర్ కోడ్ల ద్వారా దశాబ్దాలుగా కార్మికులు సాధించుకున్న ఎనిమిది గంటల పని దినం, ఉద్యోగ భద్రత, యూనియన్ల హక్కులు, వేతనాలపై సంప్రదింపుల హక్కులు వంటి కీలక అంశాలను నిర్వీర్యం చేసే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. దేశవ్యాప్తంగా 30 కోట్లకు పైగా అసంఘటిత కార్మికులు ఈ సమ్మెలో పాల్గొంటున్నారని పేర్కొంటూ, ఇది కేంద్ర ప్రభుత్వానికి గట్టి హెచ్చరిక అని అన్నారు. వెంటనే నూతన లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు జీడిమెట్ల పరిధిలోని పలు పారిశ్రామిక ప్రాంతాలను సందర్శించి కార్మికులను బంద్‌లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు నరసింహారెడ్డి, బక్కరి మల్లేష్, గుర్రప్ప, కే.శ్రీనివాస్, పి.శ్రీనివాస్, రమేష్, భీమేష్, మహేందర్, యాగంటి, మజ్జి గౌరీ, సిఐటియు నాయకురాలు స్వాతి, ఆంజనేయులు, టీసీఐ నాయకులు రాంబాబు తదితరులతో పాటు వందలాది మంది కార్మికులు పాల్గొన్నారు.



# తూప్రాన్ లో రేషన్ బియ్యం పట్టివేత.....

**తూప్రాన్ ఫిబ్రవరి 12 ప్రజాస్వరం)**

తూప్రాన్ మండలంలో జాతీయ రహదారిపై నమ్మదగిన సమాచారంతో సివిల్ సప్లై అధికారులు మరియు ఎన్ఫోర్స్‌మెంట్ పోలీసులు వాహనాల తనిఖీ లో అక్రమంగా తరలిస్తున్న రేషన్350 క్వింటలు బియ్యాన్ని పట్టుకొని తూప్రాన్ పోలీసులకు అప్పగించారు , తూప్రాన్ వద్ద GJ 25W 3228 నెంబరు లారీని సివిల్ సప్లై బృందం పట్టుకుంది. ఈ లారీలో వివిధ రంగుల ప్లాస్టిక్ బ్యాగులలో సుమారు 350 క్వింటాళ్ల పీడీఎస్ రైస్ ఉంది. లారీని, డ్రైవర్ శ్రీ పర్మార్ రామ్ దేవదాస్‌ను తూప్రాన్ ఎస్ఐ గంగారాజు కు అప్పగించారు. పంచనామా చేయించేందుకు డీసీఎస్ఓ మెదక్ పండరి సిఐ ఎస్సై వెంకటేశ్వర్లు సంబశివరావు లు సిబ్బంది ఉన్నారు



# ఊరేగింపు బాణాసంచా రోడ్డు షాప్ లకు అనుమతి లేదు...

- **సిఐ రంగా కృష్ణ**

**తూప్రాన్ ఫిబ్రవరి 12 (ప్రజా స్వరం)**



మున్సిపల్ ఫలితాలు వచ్చాక అభ్యర్థులు ఊరేగింపులు డిజే సౌండ్ రోడ్డు షాప్ లకు బాణాసంచా కాల్చడం అనుమతి లేదని సిఐ రంగా కృష్ణ తెలిపారు తూప్రాన్‌లోని నోబుల్ కళాశాలలో ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, ఎన్నికల ఏజెంట్లు, కౌంటింగ్ ఏజెంట్లు మరియు తూప్రాన్ పట్టణ ప్రజలకు సూచనలు చేసిన తూప్రాన్ సిఐ రంగా కృష్ణ తెలిపారు కౌంటింగ్ కేంద్రానికి వచ్చే వారందరూ తమ వాహనాలను లింగారెడ్డిపేట్ బస్టాండ్ సమీపంలో, 200 మీటర్ల దూరంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక పార్కింగ్ ప్రదేశంలో మాత్రమే నిలిపివేయాలి. రోడ్డుకు ఇరువైపులా వాహనాలు పార్క్ చేసినట్లయితే సంబంధిత వాహనాలపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయి.అని సిఐ పేర్కొన్నారు కౌంటింగ్ కేంద్రం నుండి 200 మీటర్ల పరిధిలోకి కేవలం అభ్యర్థులు, ఎన్నికల ఏజెంట్లు మరియు కౌంటింగ్ ఏజెంట్లకు మాత్రమే ప్రవేశం అనుమతించబడుతుంది. ఇతరులకు ప్రవేశం లేదు. 200 మీటర్ల పరిధిలో సెల్ ఫోన్లు అనుమతించబడవు. సంబంధిత వ్యక్తులు తమ సెల్ ఫోన్లను బయట భద్రపరచి మాత్రమే లోపలికి రావాలి.అని చెప్పారు మున్సిపల్ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉంది. కౌంటింగ్ అనంతరం గెలిచిన అభ్యర్థులు ర్యాలీలు, రోడ్డు షోలు, బాణాసంచా కాల్చడం, డీజేలు ఏర్పాటు చేయడం, గుంపులుగా గుమికూడడం వంటి కార్యక్రమాలు నిర్వహించరాదు. మైక్‌లు, లౌడ్‌స్పీకర్లు మరియు వాహన ర్యాలీలకు అనుమతి లేదు. చట్టం మరియు శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలు తీసుకున్న వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయి. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం, ప్రేరేపించే పోస్టులు, ద్వేషపూరిత వ్యాఖ్యలు చేయడం నేరం. ఉల్లంఘించినట్లయితే కేసులు నమోదు చేయబడతాయి. గుంపులుగా చేరడం, నినాదాలు చేయడం, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడం నిషేధించబడింది. ప్రజలందరూ పోలీసు శాఖకు పూర్తి సహకారం అందించి కౌంటింగ్ ప్రక్రియను ప్రశాంతంగా మరియు సజావుగా నిర్వహించేందుకు సహకరించాలని తూప్రాన్ సిఐ రంగా కృష్ణ కోరారు

# అశ్రు నయనాల మధ్య కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రొండా మల్లారెడ్డి అంత్యక్రియలు

**మేడ్చల్ (ప్రజాస్వరం):**


మేడ్చల్ జిల్లా పూడూరుకిష్టాపూర్ డివిజన్ పరిధిలోని పూడూరు గ్రామానికి చెందిన హరిహర నందన అయ్యప్ప స్వామి దేవాలయ ధర్మకర్త, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రొండా మల్లారెడ్డి గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందారు.కాగా విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యేలు కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి,మల్లిపెద్ది సుధీర్ రెడ్డి,మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్,జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు, టీపీసీసీ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి,ఏఐసీసీ కార్యదర్శి రుద్ర సంతోష్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీసరీ మహిపాల్ రెడ్డి, రెడ్డెంగారి నవీన్ రెడ్డి,గంగపుత్ర నర్సింగరావు హాజరై వారి మృతదేహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్. మల్లారెడ్డి మృతి కాంగ్రెస్ పార్టీకి తీరనిలోటని పేర్కొన్నారు. పార్టీకి కష్ట కాలంలో అండగా ఉంటూ పార్టీ అభివృద్ధి కృషి చేసిన మల్లారెడ్డి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. వీరితో పాటుగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ మేడ్చల్ పట్టణంలోని కేఎల్ఆర్ వెంచర్ ఏర్పాటుకు ఆర్.మల్లారెడ్డి విశేషంగా సేవలు అందించారని కొనియాడారు.తన సొంత నిధులతో గ్రామంలో శ్రీహరిహర నందన అయ్యప్ప స్వామి దేవాలయం,శివాలయం నిర్మించిన ఘనత మల్లారెడ్డికి దక్కుతుందని కొనియాడారు.అదేవిధంగా గోసాయిగూడ గ్రామంలోని శ్రీ భూ లక్ష్మమ్మ ఆలయానికి తనవంతు సహకారం అందించారు.అంతేకాకుండా పూడూరు జెడ్పీహెచ్ ఎస్ హైస్కూల్ ప్రాంగణంలో శ్రీ సరస్వతి మాత విగ్రహాన్ని ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ఆధ్యాత్మిక సేవా రంగంలో ఆయన చేసిన సేవలను గుర్తిస్తూ తమిళనాడులోని ఏషియా వెదిక్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ 2022 సంవత్సరంలో గౌరవ డాక్టర్ రేటుతో సన్మానించిందని తెలిపారు.పలువురు ఆర్.మల్లారెడ్డినితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.అంత్యక్రియలను గ్రామస్తుల అశ్రునయనాల మధ్య నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మున్సిపల్,మండల అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి,రమణారెడ్డి,మాజీ సర్పంచులు ఎన్.నర్సింహ రెడ్డి,సురేందర్ ముదిరాజ్,దుడ్డు సంజీవ రావు,కోలా స్రవంతి వెంకటేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రేగు రాజు,మాజీ కౌన్సిలర్లు సాయిపేట శ్రీనివాస్,రామన్నగారి మణికంఠ గౌడ్,జకట దేవ,ఎల్లంపేట మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎర్రవల్లి విఘ్నేశ్వర్ రెడ్డి,నాయకులు బాల్ రెడ్డి,సింగరేణి పోచయ్య,సారా ముత్యాల గౌడ్,అక్రమ పాషా,సింగిరెడ్డి నరేందర్ రెడ్డి,శ్రీనాథ్ రెడ్డి,గ్రామస్తులు,కుటుంబ సభ్యులు,శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.




# పాదచారిని ఢీ కొట్టిన లారీ తీవ్ర గాయాలు 108 అంబులెన్స్ లో ఆస్పత్రికి తరలింపు...

**చిన్న శంకరంపేట ఫిబ్రవరి 12 ( ప్రజాస్వరం )**

చిన్న శంకరంపేట మండలం గవలపల్లి చౌరస్తాలో గురువారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది, ఈ ప్రమాదంలో కొరవి పల్లి తండాకు చెందిన పూల్ సింగ్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి, లారీ ఢీకొనడంతో అతను వాహనం కింద ఇరుక్కుపోయి కాలు చేయి విరిగిపోయాయి స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించగా 108 అంబులెన్స్ లో బాధితులని మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.



## ఏ అధికారంతో ఆ నిర్మాణాలు తొలగించారు..?

- కంచె తీసి.. నివేదిక ఇవ్వండి
- ఆక్రమణల కూల్చివేత, కబ్జాలను అడ్డుకునే మీ ప్రయత్నం మంచిదే
- కోర్టు విచారణలో ఉన్న నిర్మాణాల జోలికి ఎందుకు వెళ్తున్నారు
- హైడ్రాపై హైకోర్టు సీరియస్

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

హైదరాబాద్ నగరంలో కోర్టు వివాదాల్లో ఉన్న భూముల్లో ఏర్పాటు చేసిన ఆక్రమణల తొలగింపుపై రాష్ట్ర హైకోర్టు సీరియస్ అయింది. ప్రభుత్వ భూములు ఆక్రమించి కట్టిన నిర్మాణాలను బుల్డోజర్లతో కూల్చేస్తోన్న హైడ్రాపై ఆగ్రహం వ్యక్తం చేసింది. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలంలోని నార్సింగ్‌లో భూములకు సంబంధించి గురువారం హైకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా హైడ్రా అధికారులపై ధర్మాసనం సీరియస్ అయింది. కేసుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. సర్వే నంబర్లు 300 నుంచి 303 వరకు.. 306 నుంచి 311 వరకు.. 313 నుంచి 315 వరకు ఉన్న 1,608 చదరపు గజాల స్థలంలో ఏర్పాటు చేసిన పలు ప్లాట్లకు ఉన్న కాంపౌండ్‌ను హైడ్రా అధికారులు కూల్చివేశారు. ఆ తర్వాత ఆ ప్రాంతంలో కంచె కూడా ఏర్పాటు చేశారు. దీనిపై గొర్ల రాహుల్ యాదవ్ సహా మరో ఏడుగురు వ్యక్తులు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. దీంతో హైడ్రా గురువారం విచారణ జరిపింది. పిటిషనర్ తరఫున లాయర్లు ఎ.రవీందర్‌రెడ్డి, పి.పంకజ్‌రెడ్డి వాదనలు వినిపించారు. ఆ స్థలానికి సంబంధించి పిటిషనర్ల హక్కులపై కింది కోర్టు తీర్పు ఇచ్చిందని.. ఆ తీర్పుపై సంబంధింత అధికారులు వేసిన అప్పీల్ పెండింగ్‌లో ఉందని కోర్టుకు విన్నవించారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే ఈ స్థలంలో ఉన్న కాంపౌండ్‌ను హైడ్రా అధికారులు తొలగించి.. కంచె వేశారని.. బోర్డు కూడా పెట్టినట్లు తెలిపారు. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఏ అధికారంతో అక్కడి నిర్మాణాలను తొలగించి కంచెను ఏర్పాటు చేశారంటూ జస్టిస్ ఎన్‌వి శ్రవణ్‌కుమార్.. హైడ్రా అధికారులను హైకోర్టు ప్రశ్నించారు. ఆక్రమణల కూల్చివేత, కబ్జాలను అడ్డుకోవడంలో హైడ్రా చేస్తున్న ప్రయత్నాలు మంచివేనని.. కానీ సహజ న్యాయసూత్రాలను పాటించడం మాత్రం తప్పనిసరని తేల్చి చెప్పారు. హైడ్రా తరఫు వాదనలు వినిపించిన లాయర్.. ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురయ్యాయని హైడ్రాకు ఫిర్యాదు చేసినా.. అధికారుల దృష్టికి వచ్చినా చర్యలు తీసుకుంటామని తెలిపారు. హైడ్రా తరఫు న్యాయవాది చేసిన వాదనను జస్టిస్ ఎన్వీ శ్రవణ్ కుమార్ ఖండించారు. భూములను ఆక్రమించిన వారు అయినా సరే వారికి నోటీసులు ఇవ్వడం తప్పనిసరి అని పేర్కొన్నారు. అదే సమయంలో పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి నుంచి అనుమతి లేకుండానే ఇష్టం వచ్చినట్లు కంచె వేయడానికి వీల్లేదని హెచ్చరించారు. వెంటనే ఆ కంచెను తొలగించి.. నివేదికను కోర్టుకు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ కేసు విచారణను ఈనెల 24వ తేదీకి వాయిదా వేశారు.

## కోన ఊపిరిలో ఉన్న బాలుడికి కొండంత అండగా నిలిచిన భద్రాచలం ఏరియా ఆసుపత్రి వైద్యులు

- కేవలం ఒక గ్రాము రక్తం తో ఉన్న బాలుడి కి గోల్డెన్ హౌర్ లో చికిత్స చేసి ఊపిరి పోసిన వైద్యులు
- తన కార్యాలయానికి బాలుడితో పాటు చికిత్స చేసిన వైద్యులను పిలిపించి ప్రత్యేకంగా అభినందించిన జిల్లా కలెక్టర్

**బూర్గంపాడు ఫిబ్రవరి 12(ప్రజాస్వరం):**



చత్తీస్గడ్ రాష్ట్రానికి చెందిన ఒక గిరిజన బాలుడు కోన ఊపిరి తో మృత్యుతో పోరాడి క్షేమంగా ఇంటికి చేరిన ఘటన భద్రాచలం ఏరియా ఆసుపత్రి లో చోటుచేసుకుంది. వారం పాటు చికిత్స అందించిన అనంతరం సురక్షితంగా వైద్యులు ఆసుపత్రి నుండి నేడు డిస్చార్జ్ చేశారు. వివరాల్లోకి వెళ్తే ఛత్తీస్ఘడ్ రాష్ట్రంలోని సుకుమా జిల్లా కిష్టారం గ్రామానికి చెందిన రెండున్నర సంవత్సరాల మల్లం నరేష్ అనే బాలుడు కి తీవ్రమైన ఆయాసం, పొట్ట ఉబ్బడం , వొళ్ళంతా మచ్చలు, జ్వరం, తీవ్ర బల హీనత తో ఈ నెల ఐదవ తారీఖున భద్రాచలం ఆసుపత్రి లో చేరాడు. ఆ బాలుడిని పరీక్షించిన పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ వై రాజశేఖర్ రెడ్డి బాలుడికి తీవ్ర రక్తహీనత ఉందని గమనించి రక్త పరీక్షలు నిర్వహించగా కేవలం ఒక గ్రామం కంటే కూడా తక్కువ శాతం రక్తం ఉందని , రక్ష పరీక్షలకు సైతం రక్తం నరాల నుండి తీసే అవకాశం లేదని తెలిపారు. సహజంగా ప్రతి ఒక్కరికి రక్తం పది నుండి పద్నాలుగు గ్రాములు ఉండాలి. కానీ ఈ బాలుడికి కేవలం ఒక గ్రాము కంటే తక్కువ రక్తం మాత్రమే ఉన్న విషయం తెలుసుకొని వైద్యులు విస్తుపోయారు. గోల్డెన్ హౌర్ లో ఎటువంటి ఆలస్యం చేయకుండా బాలుడిని ఇతర ఆసుపత్రులకు తరలించి ఉన్న సమయాన్ని వ్యర్థం చేయకుండా వెంటనే చికిత్స ప్రారంభించారు. సరిపడా అన్ని రకాల నాణ్యమైన చికిత్స అందించి రక్త శాతాన్ని ఒక గ్రాము నుండి 8 గ్రాములకు పెంచి అతడి ప్రాణాలు కాపాడారు. సహజంగా ఇటువంటి క్లిష్టమైన వ్యాధులకు హైదరాబాద్ లోని నిలోఫర్ లాంటి పెద్ద ఆసుపత్రులు, లేదా పెద్ద కార్పొరేట్ స్థాయి ఆసుపత్రులలో చికిత్స అందిస్తారు. కానీ భద్రాచలం ఆసుపత్రి వైద్యులు ఆ బాలుడి కుటుంబ నిస్సహాయత ని గుర్తించి ఎంతో నిబద్ధత తో అతని ప్రాణాలు నిలపెట్టారు.డి సి హెచ్ ఎస్ రవిబాబు ద్వారా విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ బాలుడిని, చికిత్స చేసిన వైద్య బృందాన్ని పిలిపించుకొని ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నాలుగు రాష్ట్రాల ప్రజలకు అందులోనూ ముఖ్యంగా గిరిజనులకు భద్రాచలం ఏరియా ఆసుపత్రి ఒక సంజీవని గా పనిచేస్తుందని. క్లిష్టమైన రోగాలకు సైతం కార్పొరేట్ స్థాయిలో ఆసుపత్రి సిబ్బంది ఎంతో నేర్పుతో చికిత్స అందిస్తూ ప్రజలకు భరోసా కల్పిస్తున్నారని ఆయన సిబ్బంది సేవలను కొనియాడారు.ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణ నేతృత్వంలో భద్రాచలం ఆసుపత్రి సిబ్బంది విశేష సేవలు అందిస్తున్నారనీ, భద్రాచలం ఆసుపత్రికి ఎటువంటి అవసరాలున్నా కూడా తన వంతు సహకారం అన్ని రకాలుగా ఉంటుందని తెలిపారు. చికిత్స చేసిన బృందం లో డా.రాజశేఖర్ రెడ్డి,డా.క్రాప విజయ్ మరియు హాస్పిటల్ ఎమర్జెన్సీ వార్డ్ నర్సింగ్ సిబ్బంది ఉన్నారు. తల్లి లేని ఆ బాలుడికి ఆరేళ్ల అక్క ఒక్క తల్లి లాగా అక్కున చేర్చిన విషయం తెలుసుకొని ఆ అక్క తమ్ముళ్ళని జిల్లా కలెక్టర్ ఆప్యాయతగా పలకరించి భరోసా కల్పించారు.పలు బలవర్ధక పోషక పదార్థాలను ఇచ్చి పంపించారు.



# తెలంగాణకు 'నేనే రాజు.. నేనే మంత్రి'

మొదటిపేజీ తరువాయి

పునరావృత్తమవుతాయని ధీమా వ్యక్తం చేశారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రంలో పాలన కొనసాగుతోందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హమీలు, వాగ్దానాలను ఒక్కొక్కటీగా అమలు చేసుకుంటూ ముందుకువెళ్తున్నామని చెప్పారు.

**నిబంధనల ప్రకారమే జైలుకు కేసీఆర్...**

రాష్ట్ర రాజకీయాల్లో సంచలనంగా మారిన ఫోన్ ట్యాపింగ్ కేసు తుది అంకానికి చేరిందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఈ వ్యవహారంలో సిట్ తో విచారణ మొదలుపెట్టిన తమ ప్రభుత్వం అన్ని కేసుల్లో దర్యాప్తు ఆధారంగానే ముందుకెళ్తామని పేర్కొన్నారు. విపక్షాలు ఆరోపిస్తున్నట్లు ఈ కేసులో తాము ఎక్కడా వెనక్కి తగ్గలేదన్నారు. ఈ వ్యవహారంలో సూత్ర, పాత్రదారులను వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ప్రతిపక్ష నేత కేసీఆర్‌పై తమకు ఎలాంటి కక్ష సాధింపు లేదన్నారు. ఫోన్ ట్యాపింగ్ లో సిట్ కేసీఆర్‌ను దోషిగా నిర్ధారిస్తే.. ఒకవేళ కేసీఆర్‌ను జైల్లో వేయాల్సి వస్తే నిబంధనల ప్రకారమే వెళ్తామని పేర్కొన్నారు.

**మా పాలనలో ట్యాపింగ్ జరగడం లేదు**

తాము అధికారంలోకి వచ్చాక ఎవరి ఫోన్లు ట్యాప్ చేయడం లేదని సీఎం రేవంత్ రెడ్డి వివరణ ఇచ్చారు. ట్యాపింగ్ చేసి సంభాషణలు వింటే ఆయుష్షు తగ్గుతుందని సెటైర్లు వేశారు. ట్యాపింగ్ కాల్స్ వినడం ఓ మానసిక రోగమని వ్యాఖ్యానించారు. ఇటీవల ఖమ్మంలో మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి.. ప్రస్తుత ప్రభుత్వంలోనూ ఫోన్లు ట్యాప్ అవుతున్నాయంటూ చేసిన ఆరోపణలపై సీఎం పరోక్షంగా వివరణ ఇచ్చారు.

**కేటీఆర్‌ను ఈడీ ఎందుకు విచారించదు..?**

కాళేశ్వరం అక్రమాలు, ఫార్ములా ఈరేసుపై కేంద్ర ప్రభుత్వం చర్యలు ఎక్కడా అని సీఎం నిలదీశారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీలను విచారించిన ఈడీ, కేటీఆర్‌ను ఎందుకు విచారించడం లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కేసుకు సంబంధించిన అన్ని డాక్యుమెంట్లను త్వరలోనే అసెంబ్లీలో అందరి ముందు పెడతానని స్పష్టం చేశారు. కేసీఆర్, హరీశ్ రావు కోరినట్లుగా తమ ప్రభుత్వం నడువదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ మొత్తం అధ్యయనం చేయాలని, ఆ బాధ్యత ఓ నిపుణుల కమిటీకి అప్పగించామని తెలిపారు. మూడు గేట్ల మరమ్మతుల తర్వాత ప్రాజెక్టు కూలితే.. ఆ నింద తమపై వేయాలని బీఆర్ఎస్ చూస్తోందని ఆరోపించారు. కేసీఆర్ హయాం నుంచే సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వం బకాయి ఉందని తెలిపారు. పదేళ్ల పాటు కేసీఆర్‌ను ఆ విషయం గురించి అడగకుండా కిషన్ రెడ్డి తనను అడుగుతున్నారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

# మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుకు 100 ఎకరాలు బదలాయించండి

- రక్షణ భూముల బదిలీతో మూసీ పునరుజ్జీవనానికి ఊతం కోరిన సీఎం
- గాంధీ సరోవర్ శంకుస్థాపనకు రాజ్‌నాథ్ సింగ్‌ను ఆహ్వానించిన రేవంత్ రెడ్డి
- కృష్ణా–వికారాబాద్ రైలు మార్గం పూర్తిగా కేంద్ర నిధులతో నిర్మించాలన్న విజ్ఞప్తి
- హైదరాబాద్ కేంద్రంగా మూడు హైస్పీడ్ రైలు కారిడార్ల ప్రతిపాదన
- శంషాబాద్ సమీపంలో 500 ఎకరాలు కేటాయింపుకు రాష్ట్రం సిద్ధం
- మామూనూరు ఎయిర్‌పోర్ట్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించాలని సీఎం డిమాండ్
- ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ అనుమతులు వెంటనే మంజూరు చేయాలని విజ్ఞప్తి



మూసీ పునరుజ్జీవం.. రైలు మార్గాల మంజూరు... విమానాశ్రయాల పనులు వేగవంతమే లక్ష్యంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన కొనసాగుతోంది. ఢిల్లీలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడులతో గురువారం ముఖ్యమంత్రి వరుసగా భేటీ అయ్యారు. ఆయా ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వ అనుమతులు, భూ బదలాయింపులు.. నిధుల మంజూరును కోరుతూనే రాష్ట్ర ప్రభుత్వపరంగా ఇవ్వనున్న మద్దతు, భూ కేటాయింపులను కేంద్ర మంత్రులకు సీఎం వివరించారు. ఈసా.. మూసీ నదుల సంగమ స్థలిలో ప్రపంచస్థాయి విద్యా సాంస్కృతిక, ఆధ్యాత్మిక, పర్యావరణ కేంద్రంగా నిర్మించనున్నగాంధీ సరోవర్ ప్రాజెక్టు శంకుస్థాపన కార్యక్రమానికి రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. కేంద్ర మంత్రితో సౌత్ బ్లాక్‌లోని ఆయన కార్యాలయంలో ముఖ్యమంత్రి గురువారం భేటీ అయ్యారు. సుస్థిర పట్టణాభివృద్ధి లక్ష్యాలతో పర్యావరణ హితంగా, స్వచ్ఛమైన నీటితో నది ప్రవహించేలా మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టును చేపడుతున్నట్లు రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన 100 ఎకరాల రక్షణ శాఖ భూములను రాష్ట్ర ప్రభుత్వానికి బదలాయించాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. ఈసా... మూసీ నదుల సంగమ స్థలిలో 1948లో జాతిపిత మహాత్మా గాంధీ చితభస్మాన్ని నిమజ్జనం చేసిన బాపూ ఘాట్ వద్ద గాంధీ సరోవర్ ప్రాజెక్టు చేపడుతున్నట్లు సీఎం తెలియజేశారు. గాంధీజీ ఆశయాలైన శాంతి, ఐక్యత, సుస్థిరాభివృద్ధి, నిరాడంబర జీవనశైలిని అద్దం పట్టేలా గాంధీ సరోవర్ ప్రాజెక్టును నిర్మించనున్నట్లు కేంద్ర మంత్రికి సీఎం తెలిపారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టును ప్రపంచస్థాయి విద్యా, సాంస్కృతిక, ఆధ్యాత్మిక, పర్యావరణ కేంద్రంగా నిలుపుతామని కేంద్ర మంత్రి రాజ్ నాథ్ సింగ్‌కు సీఎం రేవంత్ రెడ్డి తెలియజేశారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టులో శాంతి చిహ్నం, జాతీయ మ్యూజియం, విజ్ఞాన కేంద్రం, చేనేత ప్రోత్సాహక కేంద్రం ఏర్పాటు చేస్తామని తెలిపారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టు కు ఫిబ్రవరి నెలాఖరులో చేసే శంకుస్థాపన, భూమి పూజ కార్యక్రమానికి హాజరుకావాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఎంపీలు డాక్టర్ మల్లు రవి, సురేశ్ షెట్కార్, డాక్టర్ కడియం కావ్య, గడ్డం వంశీ కృష్ణ, ఎం.అనిల్ కుమార్ యాదవ్, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ కే.ఎస్.శ్రీనివాసరాజు, కేంద్ర ప్రభుత్వ పథకాల సమన్వయకర్త డాక్టర్ గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు.

**కృష్ణా-వికారాబాద్ రైలు మార్గం నిర్మించాలి..**

కృష్ణావికారాబాద్ రైలు మార్గాన్ని పూర్తిగా కేంద్ర నిధులతో చేపట్టాలని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన భూ సేకరణ వ్యయాన్ని మొత్తాన్ని తామే భరిస్తామని ఇప్పటికే తెలియజేసిన విషయాన్ని సీఎం కేంద్ర మంత్రికి గుర్తు చేశారు. రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో పార్లమెంట్‌లోని ఆయన ఛాంబర్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం భేటీ అయ్యారు. ఈ మార్గంలోని టేకల్‌కోడ్ లో లైమ్ స్టోన్ నిక్షేపాలను గుర్తించామని.. సిమెంట్, జౌళి పరిశ్రమల కేంద్రంగా దానిని అభివృద్ధి చేసే ప్రయత్నాల్లో ఉన్నట్లు సీఎం కేంద్ర మంత్రికి తెలియజేశారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంతో పాటు కర్ణాటకలోని పలు సిమెంట్ పరిశ్రమలకు సమీపంలో కృష్ణా ప్రాంతం ఉందని కేంద్ర మంత్రికి సీఎం తెలిపారు. కొడంగల్, టేకల్‌కోడ్, దౌల్తాబాద్‌లను పారిశ్రామిక జోన్లుగా అభివృద్ధి చేస్తున్నట్లు సీఎం వివరించారు. హైదరాబాద్‌చెన్నై (778 కి.మీ.), హైదరాబాద్‌బెంగళూరు (586 కి.మీ.), హైదరాబాద్‌పుణే (556 కి.మీ.) హైస్పీడ్ రైలు కారిడార్లకు శంషాబాద్ ఎయిర్ పోర్ట్ సమీపంలో 500 ఎకరాల స్థలం కేటాయిస్తామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు తెలియజేశారు. అంతర్జాతీయ విమానాశ్రయం ఉన్న శంషాబాద్ నుంచే హైస్పీడ్ రైలు మార్గాలని ప్రారంభించాలని సీఎం సూచించారు. హైదరాబాద్‌చెన్నై హైస్పీడ్ కారిడార్ అమరావతి మీదుగా వెళుతుందని, అక్కడి నుంచి బందరు పోర్టుకు రైలు మార్గం మంజూరు చేయాలని కోరారు. దీంతో డ్రైపోర్ట్ నుంచి బందరు పోర్టుకు సరకు రవాణా వేగవంతం అవుతుందని వివరించారు. హైదరాబాద్‌బెంగళూరు, హైదరాబాద్‌పుణే హైస్పీడ్ కారిడార్లు శంషాబాద్ నుంచే మొదలు పెడితే అది ట్రై జంక్షన్ అవుతుందని సీఎం రైల్వే మంత్రికి వివరించారు. ఈ మూడు కారిడార్లకు భూ సేకరణ వెంటనే చేపట్టి పనులు ప్రారంభించాలని రైల్వే శాఖ మంత్రికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తులకు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ సానుకూలత వ్యక్తం చేశారు. పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో ఎంపీలు డాక్టర్ మల్లు రవి, సురేశ్ షెట్కార్, రామసహాయం రఘురాంరెడ్డి, డాక్టర్ కడియం కావ్య, గడ్డం వంశీకృష్ణ, ఎం.అనిల్ కుమార్ యాదవ్, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ కే.ఎస్.శ్రీనివాస రాజు, ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్ రాజ్, కేంద్ర పథకాల సమన్వయకర్త డాక్టర్ గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు.

### అంతర్జాతీయ ప్రమాణాలతో మమూనురు ఎయిర్‌పోర్ట్

తెలంగాణలో రెండో పెద్ద నగరమైన వరంగల్ కు సమీపంలో నిర్మించనున్న మామూనూరు ఎయిర్‌పోర్ట్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించాలని పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడుకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడుతో పార్లమెంట్‌లోని ఆయన ఛాంబర్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం భేటీ అయ్యారు. మామూనూరు ఎయిర్‌పోర్ట్‌కు అవసరమైన భూ సేకరణ పూర్తయినందున వెంటనే పనులు ప్రారంభించాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. మామూనూరు ఎయిర్‌పోర్ట్‌లో కార్గో సేవలతో పాటు మెయింటెనెన్స్.. ఓవర్ హాల్ రిపేర్ (ఎంఓఆర్) సదుపాయాలు ఉండేలా చూడాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. జౌళి, ఇతర పరిశ్రమలతో వరంగల్ నగరం పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చెందుతోందని, వరంగల్‌కు దగ్గరలో రెండేళ్లకోకసారి ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతర సమ్మక్క-సారలమ్మ జాతర మేడారంలో జరుగుతుందని కేంద్ర మంత్రికి సీఎం తెలియజేశారు. వరంగల్ ఎయిర్‌పోర్ట్ ఉమ్మడి వరంగల్‌తో పాటు ఉమ్మడి ఖమ్మం, ఉమ్మడి నల్గొండ, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలకు కేంద్రంగా ఉంటుందని కేంద్ర మంత్రికి సీఎం వివరించారు. మామూనూరు నుంచి సాధ్యమైనంత త్వరగా విమాన రాకపోకలు సాగేలా పనులు ప్రారంభించాలని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడును రేవంత్ రెడ్డి కోరారు. ఆదిలాబాద్ విమానాశ్రయానికి సంబంధించి అనుమతులు వెంటనే మంజూరు చేయాలని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు సీఎం విజ్ఞప్తి చేశారు. ఆ విమానాశ్రయ ఏర్పాటుకు అదనంగా అవసరమైన 249.82 ఎకరాలు అందజేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు కేంద్ర మంత్రికి సీఎం తెలియజేశారు. వెంటనే అనుమతుల మంజూరు చేయాలని కోరారు. మామూనూరు ఎయిర్‌పోర్ట్ పనుల ప్రారంభానికి తీసుకోవాల్సిన చర్యలకు సంబంధించి ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులను అక్కడకు పంపిస్తానని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హామీ ఇచ్చారు. సమావేశంలో ఎంపీలు డాక్టర్ మల్లు రవి, సురేశ్ షెట్కార్, రామసహాయం రఘురాంరెడ్డి, డాక్టర్ కడియం కావ్య, గడ్డం వంశీకృష్ణ, ఎం.అనిల్ కుమార్ యాదవ్, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ కే.ఎస్.శ్రీనివాస రాజు, ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్ రాజ్, కేంద్ర పథకాల సమన్వయకర్త డాక్టర్ గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
EDITOR : PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999